ట్రాక్ రికార్డ్





మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగి మోహన్ ప్రతిభ

- ఆలిండియా ఇంటర్ స్టీల్ పరుగు పందెంలో ప్రతిభ
- మలేషియాలో నిర్వహించనున్న పోటీలకు ఎంపిక

షార్ట్ రన్ ఐనా... లాంగ్ రన్ అయినా పరుగు మొదలు పెడితే రన్నింగ్ ట్రాక్ చిన్నబోవాల్సిందే... అది 200 మీటర్లు అయినా..10 కిలోమీటర్లు అయినా ప్రథమ స్థానంలో నిలవాల్సిందే. ఆయన 'ఉక్కు' సంకల్పంతో పరుగు తీస్తే ట్రాక్ రికార్డు బద్దలు కావాల్సిందే..అతనే వడ్లపూడి నిర్వాసితకాలనీకి చెందిన సిరపనశెట్టి మోహన్. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధించిన విజయాలు..పతకాలపై ఓ లుక్ వేద్దాం.

అగనంపూడి: విద్యార్థి దశలో పెట్టిన పరుగే ఆయనకు కీర్తి తెచ్చిపెట్టింది. జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. పోటీ ఏదైనా పతకం కొల్లగొట్టిన మోహన్ ఆలిండియా ఇంటర్ స్టీల్‌ప్లాంట్ అథ్లెటిక్స్ పోటీల్లో సైతం సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై మక్కువ పెంచుకొని ఓ పక్క ఉద్యోగం చేసుకుంటూ మరోపక్క అథ్లెటిక్స్‌లో నిరంతర సాధన చేస్తూ ట్రాక్ రికార్డులను మోహన్ సొంతం చేసుకున్నారు.

అంతర్జాతీయ పతకంపై గురి...

పాఠశాల స్థాయి నుంచే ఆటలపై ఆసక్తి ఉంది. ఆ దిశగా సాధన చేయడం, ఉక్కులో ఉద్యోగం వచ్చిన తర్వాత వాటిని కొనసాగిస్తూ కోచ్ ఆధ్వర్యంలో సాధన చేశాను. వచ్చేనెలలో మలేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటాను. భారతదేశ పతాకాన్ని ఎగురవేయడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను.

– ఎస్.మోహన్, వడ్లపూడి

పతకాల పంట

రెండేళ్లలో మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో మూడు స్వర్ణాలు, రెండు రజత పతకాలు సాధించాడు. కోల్‌కతాలో నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 400, 1500 మీటర్ల పరుగు పందెంలో రెండు స్వర్ణాలు, 800 మీటర్లలో రజత పతకం చేజిక్కించుకున్నాడు.

- గతేడాది జంషడ్‌పూర్‌లోని టాటా స్టీల్‌ప్లాంట్ ఆవరణలో జరిగిన ఆలిండియా స్టీల్‌ప్లాంట్ అథ్లెటిక్స్ పోటీల్లో మోహన్ 400, 800 మీటర్ల పరుగు పందెంలో రెండు రజత పతకాలు దక్కించుకున్నారు. ఈ పోటీల్లో దేశంలోని పది స్టీల్‌ప్లాంట్ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.
- విశాఖ ఉక్కు స్టేడియంలో రాష్ట్ర వెటర్న్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ 400, 800 మీటర్ల రన్నింగ్‌లో రెండు బంగారు పతకాలు, 1500 పోటీల్లో సిల్వర్ పతకం సొంతం చేసుకున్నాడు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి 1120 మంది పాల్గొన్నారు.
- ఈ ఏడాది మార్చిలో విశాఖ ఆర్కేబీచ్‌లో నిర్వహించిన ఆ్రల్వా మారథాన్ 10 కిలోమీటర్ల పరుగులో ప్రథమంలో నిలిచారు. లక్ష్యాన్ని కేవలం 39 నిమిషాల్లో చేరుకొని రికార్డు నెలకొల్పారు.
- ఈ ఏడాది జనవరిలో పోలీస్ బ్యారక్స్‌లో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంలో మూడు స్వర్ణాలతో అజేయంగా నిలిచారు.
- కోచ్ డాక్టర్ మంగా వరప్రసాద్ సారథ్యంలో నిరంతరం శ్రమిస్తూ అంతర్జాతీయ స్థాయిలో దేశ కీర్తి పతాకను ఎగురవేయడమే లక్ష్యంగా సాధన చేస్తున్నారు.



కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రెండు స్వర్ణ, రజత పతకంతో మోహన్



రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ విజేతగా పతకాలు అందుకుంటున్న ఉక్కు క్రీడాకారుడు

తూర్పు కాపులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుడివాడ అమ్మన్న

గాజువాక: కూటమి ప్రభుత్వంలో కాపు, తెలగ, బలిజలతోపాటు తూర్పు కాపులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కేటీబీ సంఘం విశాఖ సౌత్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శ్రీకృష్ణదేవ రాయ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. నామినేటెడ్ పదవుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌లకు వినతి పత్రాలను ఇవ్వనున్నట్టు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుడివాడ అమ్మన్న, కరణంరెడ్డి నర్సింగరావు, గంధం వెంకటరావు, గడసాల అప్పారావు, విందుల రమణ, నీరుకొండ రామచంద్రరావు, సోంబాబు, ఇందల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడలో మరిన్ని రైళ్లకు హాల్ట్!

అగనంపూడి: దువ్వాడ మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని తూర్పు కోస్తా రైల్వే అధికారులు రైల్వే బోర్డుకు సిఫార్సు చేస్తూ లేఖ పంపించారని రైల్వే జోన్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కె.ఈశ్వర్ తెలిపారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ వినతి మేరకు తూర్పు కోస్తా రైల్వే అధికారులు బోర్డుకు నివేదించినట్టు తెలిపారని ఆయన పేర్కొన్నారు. హౌరా బెంగళూరు (దురంతో ఎక్స్‌ప్రెస్), సంబల్‌పూర్ నాందేడ్ (నాగావళి ఎక్స్‌ప్రెస్), కామాక్య బెంగళూరు, హౌరా బెంగళూరు (ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్)లకు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

విశేషంగా అన్న సమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: మాస శివరాత్రిని పురస్కరించుకొని జీవీఎంసీ 85వ వార్డు పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం గొన్నా పూర్ణ, హేమచందర్‌నాయుడు, సింగిరెడ్డి శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో నాయకులు వరహాలు, అప్పారావు, సత్యనారాయణ, అప్పలనాయుడు, అప్పలరాజు, పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ దల్లి గోవింద్

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99లో టెన్త్ క్లాస్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిరిశెట్టి వెంకట అప్పారావు, పెంటకోట వెంకటనాగేశ్వరరావు, గొందేశి తాతారావు, పెదపూడి వాసు, చింతాలు, భగవతి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా



కరాటే పోటీల విజేతలను అభినందిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: నగరంలోని రైల్వే న్యూ కాలనీలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2024 పోటీల్లో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లోని చోటాఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ మేరకు అకాడమీ కోచ్ జీఎస్ మూర్తితో పాటు విజేతలను ఆదివారం వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అభినందించారు.

బీజేపీ మండలాధ్యక్షుల ఎన్నిక

గాజువాక: గాజువాక నియోజకవర్గ బీజేపీ మండలాధ్యక్షులను ఆదివారం ఎన్నుకున్నారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ వర్మ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పొలిమేర శ్రీను, సుహాసిని ఆనంద్, బాల, రాజేశ్వరరావు, దామోదర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పికిల్‌బాల్ టోర్నీలో వాల్తేరు క్లబ్ ప్రతిభ

బీచ్‌రోడ్డు: అత్తిలి స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహించిన విశాఖ ఓపెన్ పికిల్‌బాల్ టోర్నమెంట్‌లో వాల్తేరు క్లబ్ సభ్యులు ప్రతిభ చూపారు. ఈ క్లబ్‌కు చెందిన చిరాగ్ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసి సింగిల్స్‌లో విజయం సాధించాడు. కరణ్‌తో కలిసి డబుల్స్, రష్మికతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో విజేత నిలిచాడు. ఈ సందర్భంగా ఆదివారం అత్తిలి స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ శశికరణ్ విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పికిల్‌బాల్ క్రీడను ప్రోత్సహించేందుకు సిరిపురం, ఎండాడ, మాధవధార ప్రాంతాల్లో కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో నగరంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మెగా టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు.

అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పది

- మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, వెంకట్రామయ్య, గురుమూర్తిరెడ్డి
- ఘనంగా ఆర్యవైశ్య సంఘం నిత్యాన్నదాన మూడో వార్షికోత్సవం



నిత్యాన్నదాన వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

గాజువాక: వాసవీ ఆర్యవైశ్య అన్నపూర్ణ నిత్యాన్నదానం మూడో వార్షికోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రతిరోజు సుమారు 200 మందికి అన్నదానం చేయడం హర్షణీయమన్నారు. అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు, ఉరుకూటి చందు, వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కులుకూరి మంగరాజు, నిత్యన్నదాన ట్రస్టు చైర్మన్ కేసారపు శ్రీనురమేష్, ప్రతినిధులు నంబూరి జగన్నాథరావు, శరత్‌చంద్ర గుప్త, కోట పెద్ద వెంకటేశ్వరరావు, ముత్యాల బాబి, కేసారపు సతీష్ పాల్గొన్నారు.

హెచ్‌సీ రాజేష్‌కుమార్‌కు అభినందన



సీపీ శంఖబ్రత బాగ్చీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న హెచ్‌సీ రాజేష్ కుమార్

పెదగంట్యాడ: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హెడ్ కానిస్టేబుల్ వి.రాజేష్ కుమార్‌కు శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రశంసా పత్రం అందజేశారు. అవార్డు అందుకున్న న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ క్రైం హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజేష్‌కుమార్‌కు సిబ్బంది అభినందనలు తెలిపారు.

సెయిల్‌లో విలీనంతోనే ఉక్కుకు పూర్వవైభవం



నినాదాలు చేస్తున్న ఉక్కు శ్రామిక సంఘం నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవం రావాలంటే సెయిల్‌లో విలీనం ఒక్కటే మార్గమని విశాఖ స్టీల్‌ప్లాంట్ శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1417వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఉక్కు శ్రామిక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, నిలిచిన టెండర్లు వెంటనే పిలవాలని కోరారు. కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు, వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ఎల్‌రావు, కరణం సత్యారావు, ఎం.ప్రకాష్, కరణం బాలయోగి, జీఆర్‌కె నాయుడు, మసేనురావు, నంబాల గణపతి, చెన్నారెడ్డి, కె.గోపి, ఎస్.రాజు, ఎ.అప్పారావు, పి.పెంటారావు, కె.కోటి కనకరెడ్డి, పి.విజయ, కె.సత్యవతి, కొండమ్మ, వెంకటలక్ష్మి, రమణమ్మ, వెంకటరావు పాల్గొన్నారు.

వాహన రిజిస్ట్రేషన్ జాప్యంతో వివాదం



గొడవ కారణంగా గుమిగూడిన వాహన చోదకులు, స్థానికులు

అగనంపూడి: రెండేళ్ల కిందట విక్రయించిన ద్విచక్ర వాహన యజమాని కొనుగోలు చేసిన వ్యక్తి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మాటా మాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. కూర్మన్నపాలెం ముస్తఫ కూడలి వద్ద మాంసం దుకాణంలో పనిచేస్తున్న అబ్బూ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని రెండేళ్ల కిందట జగ్గరాజుపేటకు చెందిన వ్యక్తికి విక్రయించాడు. అప్పట్లో పేరు బదిలీ ప్రక్రియలో భాగంగా కావాల్సిన పత్రాలపై సంతకాలు చేశాడు. అయితే బదిలీ జరగక పోవడంతో ఆదివారం అబ్బూకు కొనుగోలుదారుడు ఫోన్ చేసి అడిగారు. అయితే ఆదివారం కావడంతో దుకాణం వద్ద బిజీగా ఉన్నందున సోమవారం వచ్చి సంతకాలు చేస్తానని బదులివ్వడంతో ఫోన్‌లోనే వాగ్వాదం జరిగింది. కొద్దిసేపటికి పక్కనే ఉన్న మెకానిక్ దుకాణదారుడి కుమారుడు కలుగజేసుకోవడంతో వాహనం కొనుగోలు చేసిన వ్యక్తికి చెందిన వారు వచ్చి నిలదీయడంతో కొట్లాటకు దారితీసింది. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



కిడ్నీ బాధితుడికి చెక్కు అందజేసిన మానవతా సంస్థ ప్రతినిధులు

గాజువాక: కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న కొటాన శంకరరావు అనే వ్యక్తికి గాజువాక మానవతా సంస్థ ప్రతినిధులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, చైర్మన్ నారాయణ ప్రసాద్, గాజువాక అధ్యక్షుడు వెన్నెల ఈశ్వరరావు చేతులమీదుగా రూ.15 వేల నగదు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మానవతా సంస్థ ప్రతినిధులు బి.సత్యారావు, కె.గోవిందరావు, అచ్చుతరావు, పద్మావతి, డి.ప్రసాదరావు, రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జిప్సా క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న జిప్సా ప్రతినిధులు

గాజువాక: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) ప్రతినిధులు తమ సంఘ క్యాలెండర్, డైరీలను ఆదివారం ఆవిష్కరించారు. ముత్యాలమ్మపాలెం బీచ్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, ఎస్.షణ్ముఖరావు, ప్రతినిధులు ఎం.బాబూరావు, ఎం.జగ్గారావు, మురళీ సుందరరావు, జగన్, శ్రీధర్, మౌళి, రమేష్ నాయుడు, సత్యనారాయణ, కృష్ణంనాయుడు, ప్రసాదరావు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు

కేవీపీఎస్ క్యాలెండర్..

అగనంపూడి: కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. 87వ వార్డులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిటూ నాయకులు వై.టి.దాస్, కేవీపీఎస్ నాయకులు సూరిబాబు, నందూరి నూకరాజు, నరసింహమూర్తి, మజ్జి పుష్ప కుమారి, గాలి నూకరాజు పాల్గొన్నారు.

తీశారు..వదిలేశారు

మళ్లీ గెడ్డలోకి చేరిన పూడిక



గెడ్డలో తీసిన పూడిక గట్టు పైవేసిన దశ్యం



మళ్లీ గెడ్డలో జారిన పూడిక

పెదగంట్యాడ: అధికారుల నిర్లక్ష్యం వల్ల .. చేసే పనులు ప్రజలకు ఎందుకూ ఉపయోగపడడం లేదు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు, బర్మా కాలనీ ప్రధాన గెడ్డలో మురుగు, పూడిక తీయించారు. రోజుల తరబడి వదిలేయడంతో పూడిక మళ్లీ గెడ్డల్లోకే చేరుతుంది. దీంతో స్థానికులు మురుగు కంపుతో పాటు, దోమలు కూడా ఇళ్లలోకి చేరి అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని తీసిన పూడికలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

తెలుగు సాహిత్యానికి ఆదరణ



మాట్లాడుతున్న రచయిత ఈతకోట సుబ్బారావు

సీతంపేట : సాఫ్ట్‌వేర్ రంగం వచ్చినా తెలుగు కథలకు, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదని రచయిత ఈతకోట సుబ్బారావు అన్నారు. తటవర్తి భారతి స్మారక సాహిత్య సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కథ, కథనం అంశంపై ప్రసంగించారు. తారు రోడ్డు రాకముందే కథలు ఇక్కడ పుట్టాయని, మహాకవి ఆరుద్ర అన్నట్టు తల్లి ఒడిలో నుంచే కథలు నేర్చుకుంటామని తెలిపారు. కరోనా, సోషల్ మీడియా పుణ్యమా అని ఒక రకంగా తెలుగు భాష బతికి బట్ట కట్టిందన్నారు. కథల్లో మానవీయ కోణం ఉండాలని, మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న తరుణంలో కథల్లో కూడా మార్పు వచ్చిందన్నారు. ప్రముఖ రచయిత ఎం.సుగుణరావు మాట్లాడుతూ పాలకులు చేపట్టే విధానాల వల్ల రకరకాల సంస్కరణలు వచ్చాయని, ఫలితంగా కొన్ని కుల వృత్తులు దూరమయ్యాయని తెలిపారు. కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారి జీవనం ఏ విధంగా మారిందో తెలిపే కథలు వచ్చాయన్నారు. అలాగే గోద్రా అల్లర్లు తర్వాత వచ్చిన కథ, అమెరికన్ రచయిత జేమ్స్ రాసిన నవల గురించి వివరించారు.

గ్రామ సింహాల స్వైర విహారం

బెంబేలెత్తుతున్న ప్రయాణికులు



కుక్కల గుంపు



రిజర్వేషన్ కౌంటర్ పక్కనున్న కుర్చీల్లో కునుకుతీస్తున్న వీధి కుక్కలు

అగనంపూడి: గ్రామ సింహాల సంచారంతో రైల్వే ప్రయాణికులు హడలిపోతున్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో వీధి కుక్కలు గుంపుగా కలియ తిరుగుతుండడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. మరో వైపు ప్లాట్‌ఫారాలపై పెట్టిన బ్యాగుల్లో తినుబండారాలు ఉంటే వాటిని ఎత్తుకెళుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల మాదిరిగా బెంచీలు, రిజర్వేషన్ కౌంటర్, టికెట్ల బుకింగ్ కౌంటర్ల వద్ద దర్జాగా కునుకుతీస్తున్నాయి. బెంచీలను కూడా గలీజు చేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కుక్కలు లోపలికి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కుక్కల బెడద

అక్కిరెడ్డిపాలెం: ఎక్కడ చూసినా కుక్కల బెడద పెరిగింది. వీధుల్లో గుంపులుగా సంచరించడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అయితే జీవీఎంసీ అధికారులు మాత్రం కుక్కలను ఏరివేస్తున్నాం.. కుటుంబ నియంత్రణ చికిత్స చేస్తున్నామని ప్రకటిస్తున్నారు. కానీ ఎక్కడ చూసినా.. ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.